క్లుప్తంగా

ప్రజా సమస్యలు పరిష్కరించండి



నార్సింగి మున్సిపల్ కమిషనర్ సురేందర్ రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ కోరారు. నార్సింగి మున్సిపాలిటీ కమీషనర్ సురేందర్‌రెడ్డిని బుధవారం కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పనులు అవసరం లేని చోట చేపడుతున్నారని, మంచి రోడ్లను తవ్వి వాటిపై తిరిగి పనులు చేసి బిల్లులు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు అమరేందర్‌రెడ్డి, విజయ్‌బాబు, నరేష్, దుర్గేష్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్, వినోద్‌కుమార్, రాము, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులను అభివృద్ధి చేయాలి

- మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్



తిరుమలహిల్స్‌లో పార్కును పరిశీలిస్తున్న అధికారులు, స్థానికులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని పార్కులన్నింటినీ దశలవారీగా అభివృద్ధి చేయాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ ఆదేశించారు. ఆయన ఆదేశాలతో బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో ఖీర్జా కాలనీ, తిరుమలహిల్స్ కాలనీలలోని పార్కులను డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనికలు పరిశీలించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, తిరుమలహిల్స్ అధ్యక్షుడు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీ ప్రొఫెసర్‌కు బంగారు తెలంగాణ అవార్డు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్‌వీ శ్రీనివాసులు బంగారు తెలంగాణ అవార్డు అందుకున్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నగరంలోని డాక్టర్ దేవులపల్లి కళా నిలయంలో డాక్టర్ దైవజ్ఞశర్మ, డాక్టర్ అశోక్‌కుమార్, నటి దివ్యవాణిలు ఆయనకు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కాగా సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నర్సింహులు బుధవారం కళాశాలలో ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



లక్ష్మీనగర్ పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ సంగీత, అధికారులు

అత్తాపూర్: డివిజన్ పరిధిలోని పార్కులను అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మొంద్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. బుధవారం లక్ష్మీనగర్ కాలనీలోని పార్కును జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహమూర్తితో కలిసి పరిశీలించారు. సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, ప్రహరీ తదితర సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ ప్రెసిడెంట్ కల్కి, మూర్తి, నవీన్, బీజేపీ నాయకులు బీట్యారి సిద్ధేశ్వర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

శంషాబాద్ రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పిల్లోనిగూడ, కవ్వగూడ, తదితర గ్రామాల్లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. పిల్లోనిగూడలో ఉత్సవాలకు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచు బుచ్చమ్మ, నాయకులు రమేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

రోడ్లపైనే డంప్..

ఇష్టానుసారంగా నిర్మాణ వ్యర్థాల పారబోత



గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ రోడ్డు వెంట ఉన్న నాలాలో భవన నిర్మాణ వ్యర్థాలు పారబోసిన దృశ్యం

గచ్చిబౌలి: రోడ్ల వెంట భవన నిర్మాణ వ్యర్థాలను పారబోస్తున్నారు. ఐటీ కారిడార్‌లో ఈ పరిస్థితి ఎక్కువగా కనపడుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మాణ రంగం జోరు మీద ఉండటంతో వ్యర్థాలు అదే స్థాయిలో వస్తున్నాయి. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ వ్యర్థాల తొలగింపునకు గతంలో టోల్‌ఫ్రీ నంబరు ప్రవేశపెట్టింది. అవగాహన సదస్సులను సైతం నిర్వహించింది. కానీ వ్యర్థాల డంప్ మాత్రం ఆగడం లేదు. శేరిలింగంపల్లి సర్కిల్-21 పరిధిలోని బ్రహ్మకుమారీస్ రోడ్డులో భవన నిర్మాణ వ్యర్థాలు పారబోస్తున్నారు. ఇక్కడ నిర్వహించే మెడిటేషన్ వర్క్‌షాపులకు మంత్రులు, వివిధ దేశాల నుంచి వీఐపీలు వస్తుంటారు. డంపింగ్‌తో రోడ్లు కళావిహీనంగా తయారయ్యాయి. వ్యర్థాలతో ఈ ప్రాంతంలో వరద నీరు వెళ్లే నాలా పూడిపోయింది. వానొస్తే నీరు రోడ్డుపైనే ఉంటోంది. నిఘా లేకపోవడంతో రోడ్లు, చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాల్లో ఇష్టానుసారంగా వ్యర్థాలను పారబోయడం పరిపాటిగా మారింది. వ్యర్థాల అక్రమ డంప్‌కు అడ్డుకట్ట వేస్తేనే క్లీన్ సిటీగా మారుతుంది.

గతంలో ఇలా....

గతంలో నిర్మాణ వ్యర్థాల డంప్‌పై ప్రత్యేక నిఘా ఉండేది. జీహెచ్ఎంసీకి చెందిన ఓ ఉద్యోగి సైబరాబాద్ కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్‌లో పని చేసే వారు. నిర్మాణ వ్యర్థాలతో వెళ్లే వాహనాలను సీసీ పుటేజీలలో పరిశీలించి ఆ వాహనం ఎక్కడ డంప్ చేస్తుందో చూసి ఆ పుటేజీని వాహనదారునికి పంపి భారీ జరిమానా విధించేవారు. అయినా వారిలో మార్పు రాకుంటే పీఎస్‌లో ఫిర్యాదు చేసేవారు. ప్రస్తుతం నిఘా కొరవడంతో కొందరు టిప్పర్ల యజమానులు నిర్మాణ వ్యర్థాల తరలింపును కాంట్రాక్ట్ తీసుకొని రోడ్ల వెంట డంప్ చేస్తున్నారు. చర్యలు తీసుకోకపోవడంతో డంపింగ్ ఆందోళన కలిగించే రీతిలో పెరుగుతోంది.

స్పెషల్ డ్రైవ్

నిర్మాణ వ్యర్థాలు, చెత్త తొలగింపుపై వంద రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లోను నిర్మాణ వ్యర్థాల తొలగింపు పాక్షికంగానే కొనసాగిందని చెప్పవచ్చు. బ్రహ్మకుమారీస్ రోడ్డుతో పాటు గాలిదొడ్డిలో విచ్చలవిడిగా వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. రాత్రి సమయంలో డంప్ చేసే వాహనాలను సీజ్ చేస్తేనే సమస్య పరిష్కారానికి నోచుకుంటుంది. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సమన్వయంతో ఈ అక్రమ డంపింగ్‌ను అడ్డుకోవాలని పలువురు అంటున్నారు.

ముగిసిన పైలెట్ ప్రాజెక్ట్

శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో నిర్మాణ వ్యర్థాల తరలింపు కోసం పైలెట్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే నిర్మాణ వ్యర్థాలను భవనాల నుంచి నేరుగా రాంకీ సంస్థ ఫతుల్లాగూడ ప్లాంట్‌కు తరలించేది. ఆ సంస్థతో కుదుర్చుకున్న పైలెట్ ప్రాజెక్ట్ ముగిసింది. దీంతో ప్రస్తుతం రోడ్ల వెంట డంప్ చేసిన వ్యర్థాలను తొలగించేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. అందమైన రోడ్లు, చెరువులు డంప్‌యార్డులుగా మారుతున్నాయి. కోట్ల రూపాయలు పెట్టి నిర్మాణాలు చేపట్టే యజమానులు కొద్దిపాటి ఖర్చుతో వ్యర్థాలను రీసైక్లింగ్ ప్లాంట్లకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో బ్యూటి పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 14 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభంకానున్నట్లు పేర్కొన్నారు. 30 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణకు 19 నుంచి 45 ఏళ్ల వయస్సు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బోనాలకు భారీ ఏర్పాట్లు

బండ్లగూడ: బోనాలను ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. హైదర్షాకోట్‌లో నూతనంగా నిర్మిస్తున్న గాలి పోచమ్మ దేవాలయంలో జరుగుతున్న ఉత్సవ ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దేవాలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరుగుతాయన్నారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్



ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: రైతులకు ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, అందరికీ మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచిస్తే బీఆర్ఎస్ నేతలు దానిని వక్రబుద్ధితో తప్పుడు ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ఎన్‌పిఏ, శివరాంపల్లి, గగన్‌పహాడ్ సబ్‌స్టేషన్‌ల వద్ద బుధవారం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రీపురం, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్ డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ తాజుద్దీన్, ఎన్.ధనుంజయ్, మహ్మద్ ఇస్మాయిల్‌తోపాటు నేతలు ఫిరోజ్‌భాయ్, ముజఫర్, బాబా, నవాజ్, ఇమ్రాన్, ఖలీమ్, కరీం, మనోహర్, శేఖర్‌యాదవ్, సంజయ్ యాదవ్, జనార్దన్, జగన్, ప్రభాకర్, రాజు, చందు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



అలకాపూర్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని అవమానపరిచేలా మాట్లాడిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణలు చెప్పాలని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు డిమండ్ చేశారు. అలకాపూర్ చింతచెట్టు చౌరస్తాలో బుధవారం మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులకు 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించటంతో పాటు వారికి రైతుబంధు, రైతు బీమా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు బషీర్, కౌన్సిలర్లు వసంతరావు, పి.శైలజవినోద్, నాయకులు నీలేష్‌ప్రసాద్, జయరాజ్, ప్రమోద్‌రెడ్డి, సత్యనారాయణ, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

బండ్లగూడ: బీజేపీని బలోపేతం చేయడంలో ప్రతి నాయకుడు, కార్యకర్త తమవంతు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు టి.అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పోనమోని మల్లేష్‌యాదవ్, కోకన్వీనర్ మహాలింగంగౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా, పదాధికారుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలో క్షేత్రస్థాయి వరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ నెల13వ తేదీన ఉదయం 8 గంటలకు రాష్ట్ర స్థాయి నుంచి మండల, డివిజన్ స్థాయి నాయకుల విస్తృత సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వై.శ్రీధర్, బుక్క వేణుగోపాల్, రాష్ట్ర యువ మోర్చా ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్, జిల్లా బీజేపీ కార్యదర్శి మొంద్ర కొమురయ్య, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు దుద్యాల లక్ష్మినారాయణ, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, మండే నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

రాజేంద్రనగర్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ పిలుపులో భాగంగా రాజేంద్రనగర్ డివిజన్ కేంద్రంలో స్కూళ్లను మూసివేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాజేంద్రనగర్ కమిటి సభ్యులు శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రతి ఒక్క విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందించాలన్నారు. మన ఊరు-మన బస్తీ పథకంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను చేర్చాలని, అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలని నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్రంలో ఉన్న ప్రతిఒక్క యూనివర్సిటీలో వీసీలను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌సిప్ ఫీజులు విడుదల చేయాలన్నారు. విద్యార్థి సంఘాల డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయితేజ, వేణుప్రకాష్, దర్శన్, ఆశిష్ పాల్గొన్నారు.

చెత్త ఆటోలకు ఇస్తున్నారా ?

ప్రజలకు అవగాహన కల్పించిన కమిషనర్



చెత్తచెదారాన్ని ఆటో రిక్షా కార్మికులకు అందించాలని సూచిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు చెత్తను చెత్త సేకరణ కార్మికులు, రిక్షాలకు అందజేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర సూచించారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని 1,2వ డివిజన్లలో శానిటేషన్ నిర్వహణను ఆయన పరిశీలించారు. ఆటోలు ఎలా చెత్తను సేకరిస్తున్నారు, ఏ ఇంటి యజమానులు చెత్తను ఆటోలకు అందించడం లేదు, ఓపెన్ పాయింట్లల్లో చెత్తను వేస్తున్న వారిని గుర్తించడం, తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి అందిస్తున్నారా తదితర వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తచెదారాలను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో, నాలాల్లో వేయవద్దన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో అందజేసిన మూడు డస్ట్‌బిన్‌లను ఉపయోగించుకోవాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో మున్సిపల్ కార్మికులు జాగ్రత్తలు పాటిస్తూ తమ విధులు నిర్వర్తించాలన్నారు. రెయిన్‌కోట్‌లు, చేతి గ్లౌజులు, షూ, మాస్క్ తప్పకుండా ఉపయోగించాలన్నారు. మున్సిపల్ జవాన్లు, ఎస్ఎఫ్ఏలు ఓపెన్ పాయింట్లల్లో చెత్తచెదారం వేయకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్ రామాంజులు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

శంషాబాద్ రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన కవ్వగూడ మాజీ ఎంపీటీసీ మైసయ్యకు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ బుధవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంగీత సిద్దేశ్వర్, సర్పంచు రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాల పంపిణీ

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం సొసైటీ ఆధ్వర్యంలో చైర్మన్ సతీష్ బుధవారం రైతులకు రుణాలను పంపిణీ చేశారు. 52 మంది రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలకు గాను రూ.54 లక్షలను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, శివాజీ, అధికారి సురేందర్, రైతులు పాల్గొన్నారు.

మరియా సదన్‌లో హిమాన్షు బర్త్‌డే

శంషాబాద్ రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ మనుమడు హిమాన్షు తన పుట్టిన రోజును వృద్ధుల మధ్య చేసుకున్నారు. బుధవారం మండలంలోని కేకే.బస్తీలో ఉన్న మరియా సదన్ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో హిమాన్షుకు ఘన స్వాగతం పలికారు. నాయకులు ఏర్పాటు చేసిన బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు.

ముగిసిన వర్క్‌షాప్



గ్రామీణాభివృద్ధి పై జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న పంచాయతీ సిబ్బంది

రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్ సంస్థలో యంగ్ ఫెలోస్, స్టేట్ ప్రోగామ్ కోఆర్డినేటర్లతో పంచాయతీ అభివృద్ధి సూచికపై జరిగిన రెండు రోజుల వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌నకు పంచాయతీ రాజ్ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, కార్యదర్శి చంద్రశేఖర్, అదనపు కార్యదర్శి వికాస్ ఆనంద్ పాల్గొని పంచాయతీల అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. - ఏజీవర్సిటీ

బీఆర్ఎస్‌ను ఆదరించాలి



మణికొండ: దేశంలోనే ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ప్రతి లబ్ధిదారుడు ఆదరించాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మన్ జి. వెంకటేశ్‌యాదవ్‌లు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 6,7,8,16 వార్డులలో మంజూరు అయిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి చనిపోయేంతవరకు ప్రజలకు అవసరమైన అన్ని రకాల పథకాలను అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. అలాంటి ప్రభుత్వాన్ని మరోసారి తెచ్చుకోవాల్సిన బాధ్యత ప్రజలందిరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పత్తి ప్రవీణ్ కుమార్, ఎం.నాగపూర్ణ శ్రీనివాస్, పద్మావీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మార్పు తీసుకురావాలి

అత్తాపూర్: పుట్టిన రోజు వేడుకల్లో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పాఠ్యపుస్తకాలు, డిక్షనరీలు, పుస్తకాలు పంపేలా వారిలో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.సాయిప్రసాద్‌రావు అన్నారు. పుస్తక పఠనం ఆవశ్యకతను తెలియజేస్తూ అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పిల్లల చేత పుస్తకాలు చదివించి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో రజియాబేగం, సరళ, మీనా కుమారి, రోజారాణి, జకీరా, పద్మావతి, జ్యోతి, మాణయ్య, హేమలత, సురేష్, గోపి, లింగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలి

రాజేంద్రనగర్: బోనాల నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని దేవాలయాల కమిటీ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు. దేవాలయాల వద్ద పిచ్చిమొక్కలు పెరిగి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రతి సంవత్సరం పది రోజుల ముందు పారిశుధ్య కార్యక్రమాలతో పాటు ఇతర అభివృద్ధి పనులు జీహెచ్ఎంసీ చేపడుతుందని, మరో నాలుగు రోజులు పండగ ఉన్నా ఎలాంటి పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్ డివిజన్‌ల పరిధిలో దాదాపు 150 చిన్నపెద్దా దేవాలయాలు ఉన్నాయి. ఏటా ఆషాఢమాసంలో ఈ దేవాలయాల వద్ద భక్తులు బోనాలు సమర్పించడంతో పాటు పూజా కార్యక్రమాలు చేపడతారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ అభివృద్ధి పనులను చేపడుతుంది. ఇందుకు ప్రత్యేకంగా బడ్జెట్ సైతం కేటాయిస్తుంది. ఇప్పటి వరకు ఎలాంటి పనులను ప్రారంభించలేదు. చెత్తచెదారాన్ని సైతం తొలగించలేదు. దీంతో స్థానికులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సర్కిల్‌లో కమిషనర్ పర్యటన

అత్తాపూర్: జీహెచ్ఎంసీ కొత్త కమిషనర్ రోనాల్డ్ రాస్ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడ, అత్తాపూర్, కాటేదాన్ ప్రాంతాల్లో బుధవారం పర్యటించి స్థానికులతో మాట్లాడారు. స్థానికంగా పారిశుధ్య పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

'ప్రభుత్వం మోసం చేస్తోంది'

మణికొండ: రాష్ట్రంలో 24గంటల ఉచిత విద్యుత్ పేరుతో రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్ అన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ చింత చెట్టు వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను నాయకులతో కలిసి ఊరేగించి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9 సంవత్సరాలలో విద్యుత్ సంస్థలను రూ.60వేల కోట్ల అప్పుల్లో ముంచి తన అవినీతికి వాటిని బలిచేసిన ఘనుడు కేసీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కె.లక్ష్మినారాయణ, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు కిరణ్‌కుమార్, రాములు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించండి

ఎమ్మెల్యేను కోరిన నాయకులు



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ శ్మశానవాటికకు హద్దులు లేకపోవటంతో బాటు సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమస్య పరిష్కరించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. బుధవారం బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో వారు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని సూచించారు.అలాగే మణికొండ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో శ్మశానవాటికలో ప్రజలకు అవసరమైన స్నానాల గదులు, నీటి సౌకర్యం, గదులు కట్టించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు నవీన్‌కుమార్, వసంతరావు, నాయకులు జయరాజ్, శ్రావణ్‌కుమార్, నరేందర్, గంగాధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు

అత్తాపూర్: దోపిడీ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అత్తాపూర్ కుమ్మరబస్తీకి చెందిన వెంకటయ్య తన స్నేహితుడు సిద్ధుతో కలిసి ఉప్పర్‌పల్లిలో ఇంటి నిర్మాణ పనికి వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో అత్తాపూర్‌కు చెందిన గిద్దా సింగ్, ప్రేమ్‌సింగ్‌లు కత్తులతో బెదిరించి గొడవకు దిగారు. ఈ క్రమంలో వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్‌లతో పాటు 3 వేల నగదు తీసుకుని పరుగులు పెట్టారు. వెంకటయ్య, సిద్ధు వెంబడించినా ప్రయోజనం లేకుండాపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకోని సీసీ పుటేజీ ఆధారంగా గిద్దా సింగ్, ప్రేమ్‌సింగ్‌లుగా గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకోని దర్యాప్తు చేస్తున్నారు.